



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం 6:24(సాయంత్రం)
సెహరీ : సోమవారం 4:56 (ఉదయం)

- నంద్యాల మున్సిపాలిటీలో అధికారుల నిర్లక్ష్యం
- పార్టీ రంగులు, బోర్డుల తొలగింపులో పక్షపాత ధోరణి

నిబంధనలకు కలరింగ్

నంద్యాల టౌన్, మార్చి 23 :
నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల కోడ్ అమలు వ్యవహారం అభాసుపాలవుతోంది. రాజకీయ పార్టీల రంగులతో కూడిన శిలాఫలకాలకు ముసుగు వేయకుండా వదిలేశారు. శిలాఫలకాలపై రాజకీయ నాయకుల పేర్లు, తదితర వాటిని ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా బహిరంగ ప్రదేశాల్లో కనిపించకుండా ముసుగు వేయాల్సిన అధికార యంత్రాంగం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో సంబంధిత అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో కోడ్ నిబంధనలు అమలు చేయకపోవడంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నంద్యాల పట్టణంలోని 35వ సచివాలయం ఇది. వైసీపీ రంగులతో ఉన్న భవనానికి రంగులు తొలగిస్తారో లేదా వేసి చూడాల్సిందే



సరస్వతినగర్ - శ్యామ్‌నగర్ బ్రిడ్జి ప్రారంభోత్సవ శిల ఫలకానికి ముసుగు వేశారు ఇలా..



పద్మావతినగర్ ఆర్చీ వద్ద తూతూ మంత్రంగా ముసుగు వేయడంతో వైసీపీ రంగులతో కనిపిస్తున్న శిలా ఫలకం

కోడ్ వచ్చి రోజులు గడుస్తున్నా..

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులోకి వచ్చి రోజులు గడుస్తున్నా అధికారులు మాత్రం నిర్లిప్త ధోరణితో వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీకి సంబంధించిన రంగుల తొలగింపు, అధికార పార్టీ నాయకుల పేర్లు ఉండే బోర్డుల తొలగింపు, మా నమ్మకం నువ్వే జగన్ అంటూ వ్యాపార, వాణిజ్య నిర్వాహకుల పేరుతో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 42 వార్డులు ఉన్నాయి. మొత్తం 37 వార్డుల్లో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత కొద్ది నెలలుగా ఎన్నికల నేపథ్యంలో వైసీపీ రంగులు, అధికార పార్టీకి చెందిన నాయకుల పేర్లతో శిలా ఫలకాలను ఏర్పాటు చేశారు. అయితే వీటికి పూర్తి స్థాయిలో ముసుగు వేయకుండా అధికార పార్టీ నాయకులు తెరవెనుక చక్రం తిప్పారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నంద్యాల పట్టణంలోని 21వ వార్డు నూనెపల్లె హరిజనవాడ వైసీపీ ఇన్‌చార్జి అమృతరాజ్ ఇల్లు ఇది. మా నమ్మకం నువ్వే జగన్ హోర్డింగ్‌తో ఇలా..



పద్మావతినగర్ రోడ్డులో జీఎస్‌ఆర్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న శిలాఫలకం ఇది. ఎలాంటి రంగులు లేకుండా ఉన్న పాత శిలాఫలకానికి పకడ్బందీగా ముసుగు వేశారు.



నూనెపల్లె ఓవర్ బ్రిడ్జి కింద జలశుద్ధి పంపిణీ కేంద్రం ఇది. బోర్డులో ఇరువైపులా అధికార పార్టీ నేతల ఫొటోలపై న్యూస్ పేపర్‌ను అంటించి 'సదామీ సేవలో శిల్పా సేవా సమితి' స్లోగన్‌ను అలాగే ఉంచిన దృశ్యం

సచివాలయాలకు వైసీపీ రంగులు తొలగేనా..?:

నంద్యాల మున్సిపాలిటీలో పలు వార్డు సచివాలయాలకు వైసీపీ రంగులను గతంలో వేశారు. ఇప్పటికీ వైసీపీ రంగులతోనే సచివాలయాలు దర్శనమిస్తున్నాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వైసీపీ రంగులు తొలగించాల్సి ఉంది. మరో పక్క అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులు తమ నివాసాలకు మా నమ్మకం నువ్వే అంటూ వైసీపీ లైటింగ్ బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. వార్డుల్లో క్షేత్ర స్థాయిలో సచివాలయాల సిబ్బంది ఎన్నికల కోడ్ నిబంధనల అమలును పట్టించుకోకపోవడంతో ఫ్లెక్సీ బోర్డులు, లైటింగ్ బోర్డులు నివాస గృహాలకు సైతం ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. అలాగే సేవా కార్యక్రమాలకు సంబంధించిన వాటిపై కూడా అధికార పార్టీకి అనుకూలంగా ముసుగు కప్పకుండా వదిలేశారు. దీంతో అధికార పార్టీకి చెందిన నాయకుల కనుసన్నల్లో అధికారులు పని చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- సీ విజిల్ యాప్ ఫిర్యాదులపై స్పందించాలి
- లైసెన్సు గన్‌లను డిపాజిట్ చేయించాలి
- ఎస్పీల వీడియో కాన్ఫరెన్స్‌లో డీఐజీ విజయరావు



కర్నూలు, మార్చి 23: ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి ప్రతి ఒక్కరూ పని చేయాలని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా చూడాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు అన్నారు. శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి డీఐజీ విజయరావు కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా ఉంచాలని, ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైతే పికెట్ ఏర్పాటు చేయాలని అన్నారు. నేర నివారణకు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందస్తుగా పోలీసు అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కర్నూలు రేంజ్ పోలీసులు బాధ్యతగా పని చేయాలని, ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు వాస్తవాలు మీడియాకు వెల్లడించాలన్నారు. అలాగే సీ విజిల్ యాప్ ఫిర్యాదులపై పోలీసులు వెంటనే స్పందించాలన్నారు. గ్రేవ్ క్రైమ్‌లపై దృష్టి సారించాలని, నేర ప్రవృత్తి గల వారిని బైండోవర్ చేయాలని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర సీసీ కెమెరాలతో పకడ్బందీగా నిఘా ఉంచాలని సూచించారు. పోలింగ్ రోజున సెంట్రల్ పోలీసు బలగాలు, రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ పోలీసులతో పెట్రోలింగ్, రాత్రి గస్తీ విధులు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల ఉల్లంఘనలపై వెంటనే స్పందించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని, పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బలగాలతో రూట్ మార్చ్, ఫ్లాగ్‌మార్చ్ చేయించాలని, గన్ లైసెన్స్‌లను డిపాజిట్ చేయించాలని చెప్పారు. ఇంటిగ్రేటెడ్, బార్డర్ చెక్‌పోస్టులలో పోలీసులు, సెబ్, ఫారెస్టు, ఆర్‌టీఏ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు చెక్‌పోస్టులలో పోలీసులు అధికారులు తనిఖీలు చేయాలని, పటిష్ట నిఘా ఉంచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, కడప జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్, అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, అడిషినల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేయండి

- టీడీపీ అభ్యర్థులకు అధినేత చంద్రబాబు దిశానిర్దేశం
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రత్యేక వర్క్‌షాప్
- జిల్లా నుంచి హాజరైన అభ్యర్థులు, కీలక నాయకులు





అమరావతిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా టీడీపీ అభ్యర్థులు, నాయకులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 23: రాజకీయ, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని సీట్ల కేటాయింపులో అన్ని వర్గాలకు న్యాయం చేశామని, సమష్టిగా.. సమన్వయంతో విజయమే లక్ష్యంగా వ్యూహాల కు పదును పెట్టాలని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం విజయవాడలో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి బైరెడ్డి శబరి, బనగానపల్లె అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి, నంద్యాల అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిలప్రియ, శ్రీశైలం అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నందికొట్కూరు అభ్యర్థి గిత్తా జయసూర్య, పాణ్యం అభ్యర్థి గౌరు చరితారెడ్డిలతోపాటు రాష్ట్ర కార్యదర్శులు, తదితరులు జిల్లా నుంచి వెళ్లి వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. వీరితోపాటు నియోజకవర్గంలో ఎన్నికల విధులు, ఖర్చులు చూసే ముఖ్య నాయకులు హాజరయ్యారు. అభ్యర్థులుగా ఎంపికయ్యామని ఇంట్లో కూర్చుంటే చివరి క్షణంలో బీ ఫారం మరొకరికి ఇవ్వాల్సి వస్తుందని చంద్రబాబు హెచ్చరించినట్టు సమాచారం. రాష్ట్రంలో అధికార పార్టీ రౌడీయిజం, అధికార దుర్వినియోగానికి పాల్పడే అవకాశం ఉందని, అభ్యర్థులు, ముఖ్య నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్టు తెలిసింది.

కుదిరిన సయోధ్య



చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే బీసీ, కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, సుబ్బారెడ్డి

- కోట్ల, సుబ్బారెడ్డిలతో అధినేత చంద్రబాబు భేటీ
- సర్దుకుపోయి పని చేయాలని సుబ్బారెడ్డికి హితబోధ
- సుబ్బారెడ్డికి తగిన గౌరవం ఇవ్వాలని కోట్లకు సూచన

డోన్, మార్చి 23: టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డిల మధ్య ఎట్టకేలకు సయోధ్య కుదిరింది. సర్దుకుపోయి పని చేయాలని సుబ్బారెడ్డికి చంద్రబాబు హితబోధ చేశారు. శనివారం అమరావతిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో చంద్రబాబు డోన్ నియోజకవర్గ టీడీపీ నాయకులతో మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ముందుగా చంద్రబాబు డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డిలతో మాట్లాడారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.

సుబ్బారెడ్డికి చంద్రబాబు భరోసా


డోన్ నియోజకవర్గంలో కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలబడ్డారని, అంతా తాను చూసుకుంటానని ధర్మవరం సుబ్బారెడ్డికి టీడీపీ అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చారు. అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, సోదరులు పెద్దనాగిరెడ్డి, చిన్న నాగిరెడ్డి, తనయుడు గౌతమ్ రెడ్డిలతో కలిసి సుబ్బారెడ్డి చంద్రబాబును కలిశారు. డోన్ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై వారితో మాట్లాడారు. దాదాపు మూడేళ్ల నుంచి డోన్ నియోజకవర్గంలో పార్టీకి అండగా ఉన్నారని, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని నియోజకవర్గంలో నిలబడ్డారన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే సముచిత పదవిని కట్టబెడతామని సుబ్బారెడ్డికి చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే పార్టీ కోసం ఇన్ని రోజులు కష్టపడిన సుబ్బారెడ్డిని గౌరవించాలని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి హితబోధ చేశారు. ఇక వీరిద్దరూ కలిసి పని చేసేలా సమన్వయం కుదిర్చి డోన్‌లో పార్టీని గెలిపించాలని బీసీ జనార్దన్‌రెడ్డికి చంద్రబాబు సూచించారు. డోన్‌లోని ముఖ్యనేతలిద్దరి మధ్య చంద్రబాబు సయోధ్య కుదర్చడంతో డోన్ నియోజకవర్గ టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీదేవి,భూదేవి సమేత నారసింహుడు


నృసింహుడి కాళింగ నర్తనోత్సవం

నంద్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో తొమ్మిదో రోజు శనివారం జ్వాలా నరసింహ స్వామికి కాళింగనర్తనోత్సవం అలంకారంలో దర్శనమిచ్చారు. ముందుగా వేదపండితులు తొట్టి తిరుమంజనం, అశ్వ వాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. దిగువ అహోబిలంలో శనివారం ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి, సమేత అమృతవల్లి అమ్మవార్లకు కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి, సమేత అమృతవల్లి అమ్మవార్లకు నవ కలశ తిరుమంజనం, గజ వాహనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు స్వామి, అమ్మవార్లను పూలమాలలతో అలంకరించి పల్లకిలో కల్యాణ మండపానికి చేర్చారు. అక్కడ అశేష భక్త జనాల మధ్య స్వామి, అమ్మవార్లకు సాంప్రదాయబద్ధంగా ఎదుర్కోళ్ల నిర్వహించి వేదమంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా కల్యాణాన్ని జరిపించారు. స్వామి అమ్మవార్లకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ సమక్షంలో పట్టువస్త్రాలను వేదపండితులకు అందించారు. కల్యాణ మహోత్సవంలో అఖిలభారత పద్మశాలి సంఘం తరఫున రాజంపేటకు చెందిన బొడిచెర్ల శ్రీనివాసులు, నరసమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.




క్షయ అంటే భయం వద్దు..!

- జిల్లాలో 588 కేసులు..
- నివారణకు ఆధునిక వైద్యం
- పౌష్టికాహారం పంపిణీకి దాతల చేయూత
- నేడు వరల్డ్ టీబీ డే..



కర్నూలు(హాస్పిటల్), మార్చి 23: క్షయ ఓ అంటు వ్యాధి అయినప్పటికీ ప్రాణాలను కాపాడుకునే వైద్యం ప్రస్తుతం అందరికీ అందుబాటులో ఉంది. సకాలంలో వ్యాధిని గుర్తించగలిగి వైద్యుల సూచన మేరకు మందులు వాడితే పూర్తిగా నయమవుతుంది. ప్రభుత్వమే ఈ వ్యాధి నివారణకు మందులను సరఫరా చేస్తోంది. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో 588 మందికి పైగా వ్యాధిగ్రస్థులు ఉండగా.. అధికారిక లెక్కల ప్రకారం చాలా తక్కువ సంఖ్యలో చూపిస్తున్నారు. 1882 మార్చి 24 క్షయవ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియాను కనుగొన్నట్లు డా.రాబర్ట్ కాబ్ ప్రకటించారు. ఆ రోజును వరల్డ్ టీబీ డేగా జరుపుకుంటున్నారు.



ఈ ఏడాది థీమ్..!


ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన ఆరోగ్య సమస్యల్లో క్షయవ్యాధి ఒకటి. శరీరంలోని గోళ్లు, వెంట్రుకలకు తప్ప ఏ భాగానికైనా టీబీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం ప్రపంచంలో అత్యంత ప్రాణాంతకర వ్యాధిగా గుర్తించారు. డబ్ల్యూహెచ్‌వో ఈ ఏడాది యువ్ కేన్ యాండ్ టీబీ అన్న నినాదాన్ని ఇచ్చింది. 2025 నాటికి దేశంలో టీబీని అంతం చేయాలన్న నినాదాన్నిచ్చింది.

● క్షయ తగ్గుతోంది

1992లో సవరించిన జాతీయ క్షయ నివారణ పథకం కింద జిల్లాలో 9 టీబీ ట్రీట్‌మెంట్ యూనిట్లు ఉన్నాయి. ఓర్వకల్లు, కర్నూలు, వెల్దుర్తి, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, ఆదోని అర్బన్, రూరల్ ఆలూరు, పత్తికొండ ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఉన్నాయి. ఇక కర్నూలు జీజీహెచ్ ఆదోని ఏరియా ఆసుపత్రుల్లో సీబీ నాట్ పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. 2022 సంవత్సరానికి 24 లక్షల జనాభాకు 41,501 మందికి క్షయపరీక్షలు చేయగా 2,700 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. 2023లో 62,607 మందికి టెస్టులు చేయగా.. 2651 కేసులు వెలుగు చూశాయి. 2024 మార్చి 23 నాటికి 14,033 టెస్టులు చేయగా.. 588 మంది టీబీ కేసులు వచ్చాయి. టెస్టులతో పోల్చుకుంటే జిల్లాలో టీబీ తగ్గుతున్నట్లు స్పష్టమవుతోంది.

● పౌష్టికాహారానికి రూ.500:

జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్థులకు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక విభాగం ఉంది. ఎండీఆర్ (మల్టీ డ్రగ్స్ రెసిస్టెంట్)తో వ్యాధిని నివారించేందుకు ఎంతో ఖర్చు చేస్తోంది. అయితే వాటి సమాచారం మాత్రం ప్రజలకు చేరడం లేదు. ముఖ్యంగా పల్లెల్లో కంటే పట్టణాల్లో క్షయ వ్యాధి తీవ్రత అధికంగా ఉంది. ఆదోని పట్టణం, కర్నూలు నగరంలో వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో క్షయ వ్యాధిని నిర్ధారించి జిల్లా క్షయ నియంత్రణ శాఖకు వివరాలు పంపిస్తే ఆయా ఆసుపత్రుల వైద్యుల ఖాతాలో రూ.1000 వేసే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. పౌష్టికాహారం కోసం వ్యాధిగ్రస్థులకు ప్రతి నెలా రూ.500, నిక్షయ పోషణ యోజన కింద ప్రభుత్వం ఇస్తోంది. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పవర్‌గ్రిడ్ సంస్థ జిల్లాలో న్యూట్రిషన్ కిట్స్‌ను పంపిణీ చేస్తోంది.



బరువు, ఆకలి తగ్గడాన్ని టీబీగా గుర్తించాలి



బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, సాయంత్రం పూట జ్వరం రావడం, రాత్రిపూట చెమట పట్టడం, దగ్గు రెండు వారాలకు మించి ఉంటే టీబీ వ్యాధిగా నిర్ధారించుకుని చికిత్స చేయించుకోవాలి. 2024లో 588 మంది టీబీ కేసులు, 113 మొండి కేసులు ఉన్నాయి. వరల్డ్ టీబీ డే సందర్భంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓల్డ్ సీఎల్‌జీలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాం. క్షయ వ్యాధిపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తాం.

- డా.ఎల్.భాస్కర్, జిల్లా క్షయ నివారణ అధికారి, కర్నూలు

ప్రాథమిక దశలో గుర్తించాలి



క్షయ వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. నిర్లక్ష్యం చేస్తే శరీరంలోని ముఖ్య అవయవాలపై ప్రభావం చూపుతుంది. హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులలో 60 శాతం మంది క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది. ఇది చర్మం నుంచి మెదడు వరకు శరీరంలో ఏ విభాగానికైనా వచ్చే అవకాశం ఉంది. శరీర బరువుల్లో ఉన్నట్టుండి 6 నుంచి 7 కేజీల బరువు తగ్గితే టీబీగా నిర్ధారించుకుని చికిత్స చేయించుకోవాలి. మందులు రెగ్యులర్‌గా వాడాలి.

- డా.కే.సువర్ణలక్ష్మి, ఫల్మనాలజిస్టు, కర్నూలు మెడికవర్ హాస్పిటల్

గనుల శాఖకు రూ. 4.3 కోట్లు

కర్నూలు(అర్బన్), మార్చి 23: సోలాపూర్- చెన్నై నూతన జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కర్నూలు పరిసరాల్లో తవ్వలకు సంబంధించి వివిధ రకాల పన్నులు, రాయల్టీలకు మెయిల్ సంస్థ రూ.4.03,85,000 కోట్లు అందించింది. శనివారం గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడులకు మహబూబ్‌నగర్ నేషనల్ హైవే పీడీతోపాటు నిర్మాణాలు చేపడుతున్న మెయిల్ సంస్థ ప్రతినిధులు చెక్కును అందజేశారు. ఈ మేరకు గనుల శాఖ నెల రోజులుగా రావాల్సిన బకాయిల కోసం చేసిన కసరత్తుతో చేయడం వల్ల బకాయిలు రికవరీ చేయించగలిగామని అధికారులు తెలిపారు.

● స్టీల్ ఫ్యాక్టరీలో తనిఖీలు

కల్లూరు మండలం లక్ష్మీపురం రాయలసీమ ఫెరో స్టీల్ ప్లాంట్‌ను గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ పరిశీలించారు. శనివారం ఉదయం విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడుతో కలిసి ఫ్యాక్టరీకి అవసరమైన ముడిసరుకులు ఎక్కడి నుంచి తెస్తున్నారనే దానిపై ఆరా తీశారు. వాటికి ఉన్న రాయల్టీ పర్మిట్లపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడి కన్నుమూత



సర్విశెట్టి శ్రీనివాసులు (ఫైల్)

కర్నూలు(కల్చరల్), మార్చి 23: కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత జడ్పీ సీఈఓ సర్విశెట్టి శ్రీనివాసులు (79) శనివారం ఉదయం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోగల తన స్వగృహంలో కన్నుమూశారు. శ్రీనివాసులు కర్నూలు జడ్పీలో అకౌంట్స్ అధికారిగా పని చేశారు. పదోన్నతిపై అనంతపురం జడ్పీ సీఈఓగా విధులు నిర్వహిస్తూ అక్కడే పదవీ విరమణ చేశారు. కళారంగంతో ఎంతో అనుబంధం ఉన్న ఆయన తీరిక సమయాల్లో పౌరాణిక పద్య నాటకాలు వేశారు. హార్మోనిస్టుగానూ అనేక మంది కళాకారులను రంగస్థలానికి ఆయన పరిచయం చేశారు. ఆయన మృతి పట్ల జిల్లాకు చెందిన పలువురు సీనియర్ కళాకారులు తమ సంతాపం వ్యక్తం చేశారు. సర్విశెట్టి శ్రీనివాసులు సంస్మరణ సభ నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

బనగానపల్లె, మార్చి 23: బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షాషావలి (55) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షకు ఎగ్జామినర్‌గా విధులు నిర్వహిస్తుండగా ఛాతిలో నొప్పి వస్తోందంటూ కుప్ప కూలాడు. కొద్దిసేపటికి తేరుకున్న షాషావలి ఉన్నతాధికారుల అనుమతితో బనగానపల్లెలో గౌండా వీధిలో ఉన్న తన ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి షాషావలిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండె పోటు అధికమై మృతి చెందాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉపాధ్యాయుడు షాషావలి మృతదేహాన్ని ఎంఈవో స్వరూప, పలువురు ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు.

ముగిసిన బార్ అసోసియేషన్ నామినేషన్ల ప్రక్రియ

కర్నూలు(లీగల్), మార్చి 23: కర్నూలు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా శనివారం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అధ్యక్ష స్థానానికి బి.చంద్రుడు, బి.కృష్ణమూర్తిలు నామినేషన్ల పత్రాలు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి ఎం.నిత్యజీవరాజు, ప్రధాన కార్యదర్శి పదవికి టీఎస్ రవికాంత్ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, వి.క్రిష్ణమూర్తిలు నామినేషన్లు దాఖలు చేశారు. సంయుక్త కార్యదర్శి పదవికి డి.విక్రమ్ సింగ్, కోశాధికారికి ఎం.మహబూబ్ బాషా, మానే గౌతమ్, గ్రంథాలయ కార్యదర్శి పదవికి ఎస్.రామనాథ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పదవికి బంగి సుధీర్, మహిళా ప్రతినిధి స్థానానికి జి.సుమనారాణి నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు సి.ప్రభాకర్ రెడ్డి, మద్దెల శ్రీనివాసరెడ్డి, ఎం.ఆంజనేయులు, ఎస్ఏ ఇందుమతిలు తెలిపారు. ఈ నెల 28 ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరిగి.. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారని తెలిపారు.

పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 23: కర్నూలు పార్లమెంటు పరిధిలోని 8 నియోజకవర్గాలకు సంబంధించి పీవో, ఏపీవోలకు ఈ నెల 30, ఏప్రిల్ 1న రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు జరగనున్నాయి. కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న ఎంఆర్సీ కన్వెన్షన్ హాల్‌లో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన వెల్లడించారు. శనివారం పీవో, ఏపీవోలుగా నియమితులైన వారికి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. శిక్షణా తరగతులకు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. శిక్షణా తరగతులకు హాజరు కానీ వారికి ఎన్నికల నిబంధనలను అనుసరించి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 30వ తేదీన మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అదే రోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల వారీగా శిక్షణ ఉంటుంది. ఏప్రిల్ ఒకటో తేదీన ఉదయం కోడుమూరు, ఆదోని, అదే రోజు మధ్యాహ్నం నుంచి కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల వారీగా శిక్షణా తరగతులు ఉంటాయి.

అవుకులో వైసీపీకి ఝలక్

- టీడీపీలో చేరిన చల్లా సోదరుడు
- చంద్రబాబు, బీసీ సమక్షంలో చేరిక



చంద్రబాబు, బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన చల్లా రామకృష్ణారెడ్డి సోదరుడు చల్లా విజయభాస్కర్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 23: అవుకు మండలంలో వైసీపీకి మరో షాక్ తగిలింది. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే, దివంగత చల్లా రామకృష్ణారెడ్డి సొంత సోదరుడు చల్లా విజయభాస్కర్‌రెడ్డి, ఆయన బావమరిది కాశీపురం మోట్ల రామిరెడ్డిలు శనివారం బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబునాయుడు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ జనార్దన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చల్లా విజయభాస్కర్‌రెడ్డి మొదటి నుంచి అన్న వెంటే నడిచారు. ఆయన మరణించిన తర్వాత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి వెంట ఉన్నారు. భగీరథరెడ్డి మృతి చెందిన తర్వాత ప్రస్తుతం అవుకులో చల్లా మరో కుమారుడు చల్లా విఘ్నేశ్వరరెడ్డి వెంట ఉన్నారు. అయితే వైసీపీ విధానాలు నచ్చక టీడీపీలో చేరారు. చల్లా విజయభాస్కర్‌రెడ్డి, కాశీపురం మోట్ల రామిరెడ్డిలు స్వయానా బావా బావమరుదులు. చల్లా విజయభాస్కర్‌రెడ్డి గతంలో అవుకు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం అవుకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చల్లా విజయభాస్కర్‌రెడ్డి టీడీపీలో చేరడంతో టీడీపీకి బలం పెరిగినట్లైందని చెప్పవచ్చు. మోట్ల రామిరెడ్డి సతీమణి మోట్ల లావణ్య అవుకు మండలం కాశీపురం సర్పంచ్‌గా ఉన్నారు.

వైజాగ్‌ను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిన వైసీపీ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), మార్చి 23: జగన్‌రెడ్డి విశాఖను రాజధానిగా మారుస్తానని.. డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి పాలనలో డ్రగ్స్ రవాణాలో ఏపీ నెంబర్ వన్ స్థానానికి చేరిందన్నారు. విశాఖలో డ్రగ్ కంటైనర్ పట్టుబడిన ఘటనలో కూనం పూర్ణ చంద్రరావు పాత్ర ఉందని, ఇతనికి, విజయసాయిరెడ్డికి సత్సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. సీబీఐ అధికారులకు ఏపీ ఉన్నతాధికారులు ఎందుకు ఆటంకం కల్పించారో తెలపాలని ప్రశ్నించారు. కంటెయినర్‌లో మార్ఫిన్, కొకెన్, హెరాయిన్, యాంఫటేమిన్, మెస్కిలన్, వంటి భయంకరమైన మత్తు పదార్థాలు ఉన్నాయని సీబీఐ తన నివేదికలో పేర్కొందన్నారు. గతంలో విజయవాడలో ఆశిట్రేడర్స్ పేరుతో ముద్రా పోర్టులో రూ. 21 వేల కోట్ల విలువైన హెరాయిన్ దిగుమతిలో కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ కీలకంగా వ్యవహరించారని తెలిపారు. బ్రెజిల్ నుంచి మత్తు పదార్థాలు దిగుమతి చేస్తున్నారని తెలిసే జగన్‌రెడ్డి తన అధికారులను పంపారా అని అనుమానం వ్యక్తం చేశారు. డ్రగ్స్ సీజ్ చేయడానికి వెళ్లిన సమయంలో స్థానిక పోలీసులు తీవ్రంగా ప్రతిఘటించారని సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని తెలిపారు. తాడేపల్లి ప్రమేయం లేకుండా సీబీఐ అధికారులను పోలీసులు అడ్డుకోలేరని, 16వ తేదీన కంటైనర్ వస్తే 20వ తేదీ వరకు సీబీఐ అధికారుల్ని నిలువరించారని తెలిపారు. విశాఖ కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ వ్యాపారాన్ని విస్తరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు

- చెంచు గిరిజనుల ఆదాయంలో అటవీశాఖ కోతలు
- గేటుకు తాళం వేసి చెంచుల నిరసన
- దర్శనం కల్పించాలని భక్తుల ధర్నా



రోడ్డుపై బైటాయించి ఆందోళన చేస్తున్న భక్తులు

శ్రీశైలం, మార్చి 23: శ్రీశైలం శిఖరేశ్వరం అటవీ చెక్‌పోస్ట్ వద్ద శనివారం ఇష్టకామేశ్వరీ అమ్మవారి భక్తులు రోడ్డుపై బైఠాయించి అమ్మవారి దర్శనం కల్పించాలంటూ ఆందోళన చేశారు. దీంతో కిలోమీటర్లమేర రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ నెలకొంది. శ్రీశైలశిఖరేశ్వం సమీప అటవీ ప్రాంతంలో నెలకొని ఉన్న ఇష్టకామేశ్వరీ అమ్మవారి ఆలయానికి అటవీశాఖ తరపున చెంచుగిరిజనులు, స్థానికులు వాహనాలను అద్దెకు ఏర్పాటుచేసి భక్తుల నుంచి అటవీశాఖ అధికారులు వసూలు చేసే టిక్కెట్టు ధరలో యాభై శాతం డబ్బును వాహనాల నిర్వాహకులకు చెల్లిస్తారు. అయితే మూడు నెలల నుంచి వాహనాల నిర్వాహకుల నుంచి అటవీశాఖ అధికారుల దాదాపు 10 శాతానికి పైగా కోతపెట్టి చెల్లిస్తున్నారని, భక్తుల కోసం ఎంతో కష్టపడి సొంత వాహనాలు నడుపుతుంటే తమకు చెల్లించే సొమ్ములో కోత విధించడంతో చెంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టకామేశ్వరీ ఆలయానికి వెళ్లే గేటుకు తాళాలు వేసి నిరసన తెలిపారు. విషయంపై అటవీశాఖ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెంచులకు న్యాయం చేస్తామని, టికెట్ రుసుంలో 50 శాతం చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో చెంచులు శాంతించారు. ఇదిలా ఉంటే ఇష్టకామేశ్వరీ అమ్మవారి ఆలయ దర్శనానికి అటవీశాఖ అధికారులు రూ.వెయ్యి చొప్పున ఒక్కో జీపునకు ఎనిమిది టిక్కెట్లు విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు 15 జీపులకు అనుమతి ఉంటుంది. అయితే దర్శనం టికెట్లను దర్శనానికి ముందురోజు ఉదయం ఎనిమిది గంటల సమయంలో భక్తులు పొందాల్సి ఉంటుంది. ఇలా అయితే దర్శనం రోజుతో పాటు టికెట్టు కోసం ముందు రెండు రోజులతో కలిపి మొత్తం మూడు రోజులు కావడంతో ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏరోజుకు ఆరోజే దర్శనం టికెట్లను కల్పించాలని భక్తుల నుంచి డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

డోన్, మార్చి 23: సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, రీపోలింగ్ మాట వినపడకూడదని కలెక్టర్ డా.కే శ్రీనివాసులు అన్నారు. శనివారం డోన్ పట్టణంలోని షాదిఖానాలో సెక్టోరల్ ఆఫీసర్స్, వీడియో వీవింగ్ టీమ్‌లు, వీడియో సర్వేలెన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్‌లకు సాధారణ ఎన్నికలపై శిక్షణ. అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకుకు ఖర్చు పెట్టుకోవచ్చన్నారు. డబ్బు, మద్యం పంపిణీని కట్టడి చేసేలా ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు సక్రమంగా పని చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు తావు లేకుండా చూడాలన్నారు. ఏ మాత్రం అలసత్వం వహించినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో డోన్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డోన్ తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, డోన్ మున్సిపల్ కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 998 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 23: జిల్లాలో శనివారం జరిగిన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. మొత్తం విద్యార్థులు 34,929 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 33,931 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 998 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిశీలకుల అధికారి గీత (డీఎల్‌వో) 5 పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి 1 పరీక్ష కేంద్రాన్ని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 7, సిట్టింగ్ స్క్వాడ్‌లు 44 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు



నేషనల్ హైవే అధికారులతో మాట్లాడుతున్న రైతులు

పాములపాడు, మార్చి 23: పాములపాడు శివారులోని నేషనల్ హైవే 340సి రోడ్డు పనులను శనివారం రైతులు అడ్డుకున్నారు. పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. రైతులు రాకేశ్, మౌళాబ్, స్వామిదాస్ మాట్లాడుతూ సర్వేనెం 62లో తమ పొలాలు హైవేలో పోతున్నామని అధికారులు తెలిపి దాదాపు సంవత్సరం కావస్తోందని చెప్పారు. ఎలాంటి పరిహారం అందించకుండా తమ పొలాల్లో ఎలాంటి పనులు చేపట్టకూడదన్నారు. నేషనల్ హైవే అధికారులు రెవెన్యూ అధికా రులతో, రైతులతో నష్ట పరిహారం అంశాలపై చర్చించారు. వీఆర్వో ముర్తుజాను వివరణ కోరగా సర్వే నెంబరు 62లో నలుగురు ఉండగా, కొల తలు సరిగా లేవని ఒక రైతు కోర్టును ఆశ్రయించారని చెప్పారు. దీంతో ఆ సర్వే నెంబరులోని రైతులకు పరిహారం పెండింగ్‌లో ఉందని చెప్పారు. ముగ్గురు రైతుల వరకు పరిహారం అందించడానికి నివేదికలు పంపుతామన్నారు.

'ఈద్గాలో వసతులు కల్పించాలి'

నంద్యాల టౌన్, మార్చి 23: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భీమవరం రోడ్డులో ఉన్న పాత ఈద్గాలో వసతులు కల్పించాలని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎం.ఖలీల్ అహమ్మద్ కోరారు. శనివారం ఖలీల్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'

మహానంది, మార్చి 23: వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని యి.బొల్లవరం, తమ్మడపల్లి గ్రామాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సభలు, సమావేశాలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు.

'బాల్య వివాహం వద్దు'

కొత్తపల్లి, మార్చి 23: బాల్య వివాహం వద్దని, దీనివల్ల కలిగే నష్టాలపై బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. మండలంలోని కొక్కెరంచ, ఎదురుపాడు గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం భేటీ భచావో.. భేటీ పడావో కార్యక్రమం ద్వారా అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, ఆచారి, శోభన్ కుమార్, మహిళా పోలీసు మౌనిక, సీహెచ్‌వో దేవిక, ఆశా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

'టీడీపీ హయాంలోనే చెంచుల అభివృద్ధి'

బండిఆత్మకూరు, మార్చి 23: టీడీపీ హయాంలోనే చెంచుల అభివృద్ధి జరిగిందని క్లస్టర్ ఇన్‌చార్జి కంచర్ల చిన్న లింగారెడ్డి అన్నారు. శనివారం నెమిళ్ళకుంట గూడెంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించి కిట్లను చెంచులకు అందజేశారు. చిన్న లింగారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెంచుల జీవనం అంధకారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

ఆత్మకూరు, మార్చి 23: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీపద్మావతి హైస్కూల్ పది పబ్లిక్ పరీక్ష కేంద్రాలను శనివారం శ్రీశైలం ఐటీడీఏ పీవో డాక్టర్ బీ.రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన సదుపాయాలపై ఆరా తీశారు.

'పౌష్టికాహారం తీసుకోవాలి'

బండిఆత్మకూరు, మార్చి 23: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావు నాయక్ సూచించారు. బరకలకాలనీ, నారాయణపురం అంగన్వాడీ కేంద్రాలలో శనివారం సూపర్ వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు లోప పోషణ, రక్త హీనత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్, సిబ్బంది స్వర్ణకుమారి, సావిత్రి, నాగమణి, ఆశాలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

ఆత్మకూరు, మార్చి 23: ఆత్మకూరు పట్టణ శివార్లలోని డిపాల్ హైస్కూల్‌లో శనివారం ఈవీఎంల నిర్వహణపై సెక్టోరల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. శ్రీశైలం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధారాణి మాట్లాడుతూ ఈవీఎంల నిర్వహణకు సంబంధించి ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు మండలాలకు చెందిన 12 మంది సెక్టోరల్ ఆఫీసర్లకు శిక్షకుల ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆత్మకూరు తహసీల్దార్ కె.బాబు తదితరులు ఉన్నారు.

మద్యం స్వాధీనం

వెలుగోడు, మార్చి 23: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు, 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. మండలంలోని వేల్పనూరు గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బుడ్డాపై కేసు నమోదు

- అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకేనా?

ఆత్మకూరు, మార్చి 23: శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డిపై ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆత్మకూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే బుడ్డా వలంటీర్లపై బెదిరింపులతో కూడిన అభ్యంతరకమైన వ్యాఖ్యలు చేశారని ఓ వలంటీరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శుక్రవారం రాత్రి ఐపీసీ 504, 506, 155(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇదిలావుంటే ఈనెల 19న ఎన్డీఏ కూటమి పార్టీ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లు ఎక్కడైనా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే వదిలిపెట్టవద్దని ఆయా పార్టీల శ్రేణులకు పిలుపునిచ్చారు. అయితే వలంటీర్లను బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ పలువురు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎన్నికల అధికారులు ఈ నెల 20వ తేదిన మాజీ ఎమ్మెల్యే బుడ్డాకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఈనోటీసులో ప్రధానంగా వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలపై కనీసం సంజాయిషీని కూడా కోరకుండా ఇలాంటి వ్యాఖ్యలు మళ్లీ చేయవద్దని ఎన్నికలు అధికారులు సూచించినట్లు మాజీ ఎమ్మెల్యే బుడ్డా వెల్లడించారు. అయితే ఆ తర్వా త వైసీపీ నాయకులు వలంటీర్ల తో బలవంతంగా పోలీసుస్టేషన్ లో కూడా ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా మాజీ ఎమ్మెల్యే బుడ్డాపై కేసు నమోదు చేయించాలని కూడా ఎన్నికల అధికారులకు ఒత్తిళ్లకు గురిచేసినట్లు సమాచారం. దీంతో మాజీ ఎమ్మెల్యే బుడ్డా వలంటీర్లపై వ్యాఖ్యలు చేసిన నాలుగో రోజు కేసు నమోదు చేయడం గమనార్హం.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి: జేసీ

పాణ్యం, మార్చి 23: సమస్యాత్మక ప్రాంతాలలో ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కర్నూలు జిల్లా ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. పాణ్యం మండలంలోని సమస్యాత్మక గ్రామమైన మద్దూరు గ్రామాన్ని శనివారం సందర్శించారు. గ్రామంలోని 337, 338 పోలింగ్ బూతులను పరిశీలించి ఓటర్లకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని ఎంఈవో సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. ఓటర్లకు మరుగుదొడ్లు, తాగునీరు అందుబటులో ఉంచాలన్నారు. ఓటరు తన ఓటును నిర్భయంగా వినియోగించుకునేందుకు పొదుపు సంఘాలు అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ బూతుల వద్ద రాళ్లు, కర్రలు లేకుండా చూడాలన్నారు. మద్యం, డబ్బు వంటి ప్రలోభ కార్యక్రమాలు ప్రజల దృష్టికి వస్తే సి-విజిల్ యాప్‌కు సమాచారం పంపాలని, వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ అందుబాటులో వస్తుందని తెలిపారు. డబ్బుకు ఓటును అమ్ముకోవద్దని సూచించారు. గ్రామాలలో ఏ కార్యక్రమమైనా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకే జరగాలన్నారు. ఇళ్లపై జెండాలు, బ్యానర్లు, వాల్ పెయింటింగ్‌లు ఏర్పాటు చేసుకోవడానికి ఎన్నికల అధికారుల అనుమతి ఉండాలన్నారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు నమోదు అవగాహన ర్యాలీలో జేసీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, తహసీల్దారు ఫణికుమార్, ఏపీఎం ప్రసాద్, ఎస్ఐ అశోక్ తదితర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పాణ్యంలో తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కర్నూలు రిటర్నింగ్ అధికారులు కర్నూలు జిల్లా కేంద్రంలో ఉండడంతో నామినేషన్ కేంద్రాన్ని పాణ్యం నుంచి కర్నూలు కలెక్టరేట్ కార్యాలయానికి కేంద్ర ఎన్నికల అధికారులు మార్చినట్లు తెలిపారు. అనంతరం ఆమె ఆలమూరు, కొనిదేడు, గోనవరం గ్రామాలలోని పోలింగ్ బూతులను పరిశీలించారు.



మద్దూరులో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

వైసీపీలో చేరిన రేషన్ డీలర్

● సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన టీడీపీ శ్రేణులు



ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైసీపీలో చేరిన రేషన్ డీలర్ యేసుబాబు

ఆత్మకూరు, మార్చి 23: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, రేషన్‌డీలర్లతో పాటు మెప్మా విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతినెల గౌరవవేతనాలు పొందుతున్న వారు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనరాదని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా కొంత మంది వలంటీర్లు, రేషన్‌డీలర్లు ఎన్నికల నిబంధనలను ఏమాత్రం పరిగణపలోకి తీసుకోకుండా రాజకీయ పార్టీలకు వత్తాసు పలికేందుకు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలోనే శనివారం ఆత్మకూరు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో సిద్దాపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ యేసుబాబు ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైసీపీలోకి చేరినట్లు ఆ పార్టీ నాయకులే వివరాలు వెల్లడించారు. ఇందులో యేసుబాబు వైసీపీ కండువా కప్పుకొని పార్టీలోకి చేరడంపై టీడీపీ నాయకులు సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. రేషన్ డీలర్‌గా కొనసాగుతూ రాజకీయ పార్టీల కండువాలు వేసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల అధికారులు ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా కార్యాలయంలో రీసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న పరిమళ అనే మహిళ శనివారం ఆత్మకూరులోని వైసీపీ కార్యాలయంలో జరిగిన వైసీపీ రాజకీయ సమావేశంలో పాల్గొన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ రెండు ఘటనలకు సంబంధించి ఫొటో ఆధారాలతో సహా టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



వైసీపీ సమావేశంలో పాల్గొన్న మెప్మా రిసోర్స్ పర్సన్ పరిమళ

మహానందిలో 16 రోజుల వేడుకలు



రథశాలలోకి రథాన్ని లాగుతున్న ఆలయ ఈవో, భక్తులు

మహానంది, మార్చి 23: మహానంది క్షేత్రంలో 16 రోజుల పర్వదిన వేడుకలను ఆలయ వేదపండితులు, అర్చకులు, ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పూర్తయి 16 రోజులు కావడంతో శనివారం ఆనవాయితీ ప్రకారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాల మంటపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ దీక్షా విరమణ సందర్భంగా ఉద్వాసన చేశారు. అనంతరం ఆలయ ఈవో చేత రుద్రగుండం కోనేరులో మొలకలను కలిపారు. ఆ తర్వాత భక్తుల శివనామస్మరణతో రథాన్ని రథశాలలోకి లాగారు. ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'కంప్యూటర్ రంగంలో విస్తృత అవకాశాలు'

నంద్యాల (నూనెపల్లె), మార్చి 23: మారుతున్న విద్యావ్యవస్థకు అనుగుణంగా విద్యార్థులు సంసిద్ధులు కావాలని, కంప్యూటర్ రంగంలో విస్తృత అవకాశాలను వినియోగించుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ నంద్యాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీపీ రమణారెడ్డి సూచించారు. శనివారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో జాతీయ స్థాయి ఐటీ ఫెస్ట్ -2కే24 కార్యక్రమాన్ని నిర్వహించారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు వివిధ అంశాలపై పోటీ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు'

గడివేముల, మార్చి 23: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ప్రజలతో సమావేశమయ్యారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. భారీ మొత్తంలో నగదును తీసుకెళ్ల కూడదని చెప్పారు. ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'బెట్టింగ్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు'

ఆత్మకూరు, మార్చి 23: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాంటి వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

'భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం'

బండిఆత్మకూరు, మార్చి 23: దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం పాటుపడదామని సీపీఎం మండల కార్యదర్శి రత్నమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, రామచంద్రుడు అన్నారు. శనివారం బండిఆత్మకూరులో భగత్ సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాజు, ఏసేపు, శివ, సుబ్బరాయుడు, అబ్దుల్ రహెమాన్, సుబ్బారెడ్డి, దశరథుడు, నారాయణ పాల్గొన్నారు.

ఆత్మకూరు: భారతదేశ విప్లవోద్యమ నిర్మాణం భగత్‌సింగ్‌తోనే సాధ్యపడిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, కైలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్ అన్నారు.శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని నల్లకాల్వ, కొత్తరామాపురం, బాపనంతాపురం గ్రామాల్లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వివిధ సంఘాల నాయకులు వీరన్న, రాముడు, ఆశీర్వాదం, శ్రీనివాసులు, రామచంద్రానాయక్, స్వామిదాసు తదితరులు ఉన్నారు.



బండిఆత్మకూరులో నివాళి అర్పిస్తున్న నాయకులు

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

నంద్యాల క్రైం, మార్చి 23: నంద్యాల పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మురబోయిన చిన్నరాజు అనే వ్యక్తికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. శనివారం నిర్వహించిన డంకెన్ డ్రైవ్‌లో పాములపాడు మండలం పెంచికలపల్లికి చెందిన మురబోయిన రాజు మద్యం తాగి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ట్రాఫిక్ పోలీసులు అతడి వాహనాన్ని ఆపి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా అతడు మద్యం తాగినట్లు తేలిందని ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్, ఎస్ఐ ఎం.రమణయ్య తెలిపారు. దీంతో అతడిపై చార్జిషీట్ నమోదు చేసి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.రాంభూపాల్‌రెడ్డి ఎదుట హాజరుపరచగా రెండురోజులు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలో నిత్యం డంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు.

పది పరీక్షకు 60 మంది విద్యార్థుల గైర్హాజరు

కొత్తపల్లి, మార్చి 23: మండలంలోని గోకవరం, కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పది పబ్లిక్ పరీక్షలకు శనివారం 60 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్ ఎగ్జామినర్లు రఘుస్వామి, ఇబ్రహీం తెలిపారు. శనివారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు కొత్తపల్లి సెంటరులో 208 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 170 మంది హాజరు కాగా, 38 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. గోకవరం సెంటరులో 117 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 95 మంది హాజరు కాగా, 22 మంది గైర్హాజరయ్యారని చెప్పాపరు. ఈ సెంటర్లను ఫ్లయింగ్ స్క్వాడ్ బనగానపల్లె ఎంఈవో శ్రీనివాసులు తనిఖీ చేశారు.

ముగిసిన క్రీడా పోటీలు

పాణ్యం, మార్చి 23: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మహాసంగ్రామ్ క్రీడలు శనివారం ముగిశాయి. ఈ క్రీడల్లో క్రికెట్ పురుషుల విభాగంలో ఎంబీఏ జట్టు విన్నర్‌గా, మహిళా విభాగంలో సీఎస్ఈ జట్టు నిలిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. త్రోబాల్ మహిళా విభాగంలో సీఎస్ఈ జట్టు విన్నర్ గా నిలిచిందన్నారు. కబడ్డీలో ఈసీఈ జట్టు విన్నర్‌గా నిలిచిందని చెప్పారు. విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీ, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ చంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కామదహనం



కామదహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలం, మార్చి 23: శ్రీశైలం క్షేత్రంలో ఫాల్గుణ శుద్ధ చతుర్దశిని పురస్కరించు కుని శనివారం సాయంత్రం కామదహన కార్యక్రమాన్ని దేవస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించింది. ప్రధానాలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆసీనులను చేసి శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపి అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీ సేవలో భాగంగా ఉత్సవ మూర్తులను గంగాధర మండపం వద్దకు తోడ్కొని వచ్చి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. తరువాత గడ్డితో చేయబడిన మన్మథ రూపాన్ని దహనం చేశారు.

నారా లోకేశ్‌ను కలిసిన జయసూర్య



లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య

నందికొట్కూరు, మార్చి 23: విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ హాల్‌లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజాగళం ఎన్నికల వ్యూహం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య, నాయకులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నందికొట్కూరులో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని లోకేశ్ సూచించారని జయసూర్య చెప్పారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు



మాండ్ర సమక్షంలో టీడీలో చేరిన ఎర్రమఠం వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, మార్చి 23: నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలోని టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి నివాసంలో కొత్తపల్లి మండలం ఎర్రమఠం గ్రామ వైసీపీ నాయకులు చంద్రమౌళీశ్వరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు టీడీపీలో చేరారు. టీడీపీ కొత్తపల్లి మండల కన్వీనర్ నారపురెడ్డి ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాండ్ర మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. వైసీపీపై నమ్మకం పోయిందోని, దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకోసం టీడీపీని గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, గిరీశ్వరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి: జేసీ



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

నంద్యాల (కల్చరల్), మార్చి 23: సాధారణ ఎన్నికలు-2024 కోసం ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ కమిటీ నుంచి సోషల్ మీడియా, కేబుల్ చానెళ్ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రచార, ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీజుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజ, ఎంసీఎంసీ సభ్యులు పాల్గొన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతి పొందడానికి మూడు రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయి ఎంసీఎంసీ కమిటీ పరిశీలించి అనుమతి మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు పోలింగ్ ముందు రోజు తప్పనిసరిగి ఎంసీఎంసీ నుంచి అనుమతి పొంది ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్వర్క్‌లు, డిజిటల్ డిస్‌ప్లేలు, మొబైల్ నెట్వర్క్‌ల ద్వారా ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు వస్తాయని, అలాగే సామజిక మాధ్యమాలో ప్రసారాలను కూడా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సినిమా హాల్‌లోనూ ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు కూడా తప్పని సరిగా ముందస్తు ధ్రువీకరణ పొందాల్సి ఉంటుందన్నారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా చేసే ప్రసారాలు, ప్రకటనలు ఇస్తే నోటీసులు జారీ చేయాలని తెలిపారు.

జొన్న కొనుగోలు చేస్తాం: మార్క్‌ఫెడ్ ఎండీ



ఆర్‌బీకే వద్ద మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ ఎండీ శేఖర్‌బాబు

గడివేముల, మార్చి 23: రైతుల వద్ద ఉన్న జొన్నలు కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ ఎండీ శేఖర్‌బాబు చెప్పారు. మండలంలోని గ్రంథివేముల, బిలకలగూడురు గ్రామాల్లోని రైతులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. కల్లాల్లో జొన్న ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల వద్ద నుంచి ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ట్యాగ్ నమోదు ఆలస్యం చేయవద్దని అన్నారు. రైతులు తీసుకొచ్చిన సంచులు వారికే ఇస్తామని, అలాగే రవాణా చార్జీలు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మేనేజర్ నాగరాజు, ఏడీఏ రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి పాల్గొన్నారు.

తాగునీరు వృథా



గుంతకందాల రహదారిలో పైపులైన్ లీకై పొలంలో వృథాగా పారిన నీరు

వెలుగోడు, మార్చి 23: వెలుగోడు పట్టణానికి కూతవేటు దూరంలో జలాశయం ఉన్నప్పటికీ మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తుతు న్నాయి. మంచినీటి పథకాలకు మరమ్మతులు చేపట్టక పోవడంతో సమస్యలు నెలకొంటున్నాయి. వెలుగోడు నుంచి అబ్దుల్లా పురం గ్రామానికి తాగునీరు అందించే పైపులైన్ వాల్వ్‌లు పాడైపోయాయి. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. అలాగే గుంతకందాల, వేంపెంట గ్రామాలకు తాగునీరు అందించే పైపులైన్ పిల్లకాల్వ సమీపంలో పగిలిపోయింది. దీంతో నీరు వృథా అవుతోంది. తాగునీరు వృథా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్షయవ్యాధిని నిర్మూలించాలి



నందివర్గంలో ర్యాలీ చేస్తున్న డాక్టర్లు సిబ్బంది

బనగానపల్లె, మార్చి 23: క్షయవ్యాధిని నిర్మూలించాలని ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా శనివారం శాంతిరాం వైద్యశాల డాక్టర్లు మమ్మద్ అబ్దుల్ ముస్తాక్ బాషా, డాక్టర్ ఫాతిమా ఆధ్వర్యంలో వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, క్షయవ్యాధి రహిత దేశం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తులు

శిరివెళ్ల, మార్చి 23 : శిరివెళ్లలోని మోడల్ స్కూల్, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 22వ తేదీ లోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం శనివారం తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తులను విద్యార్థులు మోడల్ స్కూల్‌లో తప్పనిసరిగా అందజేయాలన్నారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు అందిస్తున్న ప్రభుత్వ హాస్టల్ వసతిని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

రుద్రవరం: రుద్రవరం ఆదర్శపాఠశాల, కళాశాలలో ప్రవేశానికి ఈ నెల 28తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు శనివారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.200, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.180 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మే 22 చివరి తేదీ అని ఆయన అన్నారు.

ఘనంగా 16 రోజుల పండుగ

బనగానపల్లె, మార్చి 23: మండలంలోని పలుకూరు గ్రామంలో మాస శివరాత్రి సందర్భంగా శ్రీరామేశ్వరాలయంలో పూజారి భాస్కరయ్య ఆధ్వర్యంలో శివపార్వతులకు శనివారం ప్రత్యేక పూజలు , అభిషేక కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని రామేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. అభిషేక కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొకి మొక్కులు తీర్చుకున్నారు.

నీటి పరిమళ పుష్పాల పుస్తకావిష్కరణ


పెద్దబోదనం పాఠశాలలో పుస్తకావిష్కరణ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చాగలమర్రి, మార్చి 23: మండలంలోని పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో 7, 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు రచించిన నీటి పరిమళ పుష్పాలు పుస్తకాలను ఆవిష్కరించారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయిణి ఎం.నాగేశ్వరమ్మ సహకారంతో పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఈ పుస్తకాన్ని రచించారు. 17 కథలను సేకరించి సంకలనం చేసి తెలుగు ఉపాధ్యాయిణి తన సొంత ఖర్చులతో పుస్తకాలను ముద్రించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నీటి పరిమళ పుష్పాల పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని వివరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

చాగలమర్రి, మార్చి 23: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని 2వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోలోని సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అజిమ్, కరిముల్లా, ఖాజారసూల్, అబ్దుల్లా, నూర్‌బాష, భాస్కర్‌రెడ్డి, రమేష్, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవి, రజాక్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదరిక నిర్మూలన

ప్యాపిలి, మార్చి 23: టీడీపీతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు కలచట్ల ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కలచట్ల గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో శంకారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటి తిరిగి పార్టీ మెనిఫెస్టో పత్రలను ప్రజలకు అందజేశారు. టీడీపీని ఆదరిస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

వైభవంగా గంధం మహోత్సవం

చాగలమర్రి, మార్చి 23: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో వెలసిన దస్తగిరిస్వామి గంధం మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో వైభవం గా నిర్వహించారు. గంధాన్ని పురవీధుల గుండా ఊరేగింపుతో దర్గా వద్దకు తీసుకెళ్లి స్వామికి ఫాతెహాలు చేశారు. దర్గా కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు దర్గా వద్ద ప్రత్యేక ఫాతెహాలు చేసి ప్రార్థనలు నిర్వహించారు.

● నేడు రాతి దూలం పోటీలు

మండలంలోని పెద్దవంగలి దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి 14 తులాలు వెండి, నాలుగో బహుమతి రూ.10,016, ఐదోబహుమతి రూ.6,116, ఆరో బహుమతి రూ.5,116 నగదును అందజేస్తామని తెలిపారు.


యనకండ్లకు చెందిన మైనార్టీ వర్గాలు టీడీపీలో బీసీ సమక్షంలో చేరిన దృశ్యం

సొంతూరి రుణం తీర్చుకుంటా

యనకండ్ల గ్రామాన్ని అభివృద్ధి చేస్తా: బీసీ ● వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరిక

బనగానపల్లె, మార్చి 23: సొంత గ్రామమైన యనకండ్ల రుణం తీర్చుకుంటానని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యనకండ్ల గ్రామం నుంచి వైసీపీకి గట్టి షాక్ తగిలింది. వైసీపీ కీలక నేతలు కార్యకర్తలు యనకండ్ల, ఎస్సీ కాలనీ వాసులు, మైనార్టీలు విడతల వారిగా 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తాటికాయల తిరుపాల్, మధు, నాగపుల్లయ్య, భాస్కర్ ఓబులేసు, సుధాకర్, బాలోబయ్య, కుళా యి, హనుమంతు, దశరథి, రాముడు, లక్ష్మయ్య, భాస్కర్, నాగపుల్లయ్య, శ్రీనివాసులు, తిరుపతయ్య, రవి, రామకృష్ణ, బలరాముడు, రాజక్క, రామాంజనేయులు, సంంజీవ, కైప సుబ్బరాయుడు, నాగరాజు, పెద్ద నాగేంద్ర, వెంకటేశ్వర్లు, మహేష్, తదితర కుటుంబాలు టీడీపీలో చేరారు వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఒక్క బీసీతోనే సాధ్యమని, అందుకే వైసీపీ వీడి టీడీపీలో చేరామన్నారు. 2024లో సీఎంగా చందరబాబునాయుడును, బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్‌రెడ్డిని గెలిపించడమే ధ్యేయమన్నారు. బీసీ మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన యనకండ్ల గ్రామాన్ని 2024లో రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసి కన్న గ్రామ రుణం తీర్చుకుంటామన్నారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు యనకండ్ల గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. చంద్రబాబును సీఎంగా చేసుకుందామన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఏకష్టం వచ్చినా అండగా ఉంటామని ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని బీసీ తెలిపారు.

● మండలంలోని యనకండ్ల గ్రామం నుంచి వైసీపీ నుంచి మైనార్టీ నాయకులు టీడీపీలో చేరారు. శనివారం టీడీపీ కార్యాలయంలో మైనార్టీ నాయకులకు బీసీ టీడీపీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఐసర్‌బాషా, హుసేన్‌బాషా, హుసేనషా, వలి, రాజుబాషా, షబ్బీర్‌హుసేన్, మహమ్మద్, వలి, చాన్‌భాషా, మహమ్మద్‌రఫీ, సలీం, మౌలాలి, తదితరులకు బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మైనార్టీ నాయకులు మాట్లాడుతూ మైనార్టీ వర్గాలకు వైసీపీ దారుణంగా మోసం చేసిందన్నారు. దుల్హన పథకం, రంజాన్‌తోఫా వంటి పథకాలను వైసీపీ ప్రభుత్వం పేద మైనార్టీలకు దక్కకుండా చేసిందని విమర్శించారు. బీసీ మాట్లాడుతూ చంద్రబాబుహయంలోనే ముస్లింలకు న్యాయం జరిగిందన్నారు. మైనార్టీ రుణాలు, రంజాన్‌తోఫా, దుల్హన్ పథకాలు అందించి ఆదుకుందన్నారు. పార్టీలో చేసిన మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తామని బీసీ తెలిపారు. కార్యక్రమంలో బొబ్బలగోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ఖాదర్, మదన్‌భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీది స్కామ్‌ల పాలన: కోట్ల సుజాతమ్మ


డోన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 23: వైసీపీ పాలనలో స్కాములు తప్ప.. ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ విమర్శించారు. శనివారం సాయంత్రం డోన్ పట్టణంలోని పాతపేటలో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ సీఎం జగన్ డ్రగ్స్, లిక్కర్ల వ్యాపారాల్లో భారీ స్కాములకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజలను దోచుకోవడం తప్ప.. రాష్ట్రానికి వైసీపీ ప్రభుత్వం చేసిన మేలు ఏమీ లేదన్నారు. మాఫియాల చేతుల్లో పాలన పెట్టి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారనీ మండిపడ్డారు. మళ్లీ చంద్రబాబు వస్తేనే రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని కోట్ల సుజాతమ్మ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, మరి రమణ, కేశవ్‌భట్, సుదీష్, ఓంప్రకాష్, చాటకొండ రజనీ తదితరులు పాల్గొన్నారు.

కూతురు కోట్ల చిత్రమ్మ పిలుపునిచ్చారు. శనివారం నగర పంచాయతీలోని 8, 13 వార్డుల కౌన్సిల్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య అధ్యక్షతన 7, 13 కౌన్సిల్ స్థానిక పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల టీడీపీ కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అధ్యక్షతన స్థానిక టీడీపీ నాయకులు గూటం శివ, రామవరం శివ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కోట్ల గిరిధర్ రెడ్డి, జనసేన నాయకులు చల్లా మద్దిలేటి స్వామి, నాగరాజు, శ్రీకంటి మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

బేతంచెర్ల, మార్చి 23: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని డోన్ నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

ప్యాపిలి, మార్చి 23: వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని ఎంపీడీవో సాయిమనోహర్ హెచ్చరించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల నియమాళిని పగడ్బందీగా అమలు చేస్తామన్నారు. రాజకీయ పార్టీలు ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించిన ఎన్నిక అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రజలు ఎవరైన నేరుగా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి రాజకీపార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని ఎంపీడీవో కోరారు. అధికార యంత్రాంగం కూడా ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించడానికి తగు జాగ్రతలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి



మాట్లాడుతున్న మధు

డోన్(రూరల్), మార్చి 23: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు విజయకుమార్, నియోజకవర్గ నాయకులు మధు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఎన్ఎస్‌యుఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పాఠశాలలకు సెలవు దినాలు ప్రకటించక ముందే ముందస్తు అడ్మిషన్లకు ప్రైవేటు పాఠశాలలు శ్రీకారం చుట్టాయనీ, విద్యాశాఖ అధికారులు వీటిపై దృష్టి సారించి వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అలాగే ముందస్తు పుస్తకాల విక్రయాలు జరగకుండా విద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

తాగు నీరు కలుషితం


కొళాయిల వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

చాగలమర్రి, మార్చి 23: చాగలమర్రి గ్రామంలోని రెండవ వార్డులో తాగునీటి కొళాయిల ద్వార రంగు మారిన కలుషిత నీరు వస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాగైతే రోగాలు రావా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొద్ది రోజులుగా రంగు మారిన నీరు వస్తుండడంతో ప్రజలు నీరు తాగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొళాయిల ద్వార నీరు సక్రమంగా రాక పోవడంతో నీటి కోసం గంటల తరబడి నిరీక్షణ చేయాల్సి వస్తోందని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆరోపించారు. కొళాయిలకు నీటి సరఫరా సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వచ్చిన నీరు కూడా రంగు మారి కలుషితమవుతుందని అన్నారు. అధికారులు స్పందించి తాగునీటి కొళాయిలకు కలుషిత నీరు రాకుండా చూడాలని అన్నారు. కలుషిత నీరు విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్యను వివరణ కోరగా బోర్లలో నీటి మట్టం తగ్గడంతో రంగు మారి ఉండవచ్చని, కలుషిత నీరు రాకుండా తగ చర్యలు తీసుకుంటామని అన్నారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల, మార్చి 23 : ప్రస్తుతం డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. శనివారం రేవనూరు గ్రామంలో నాలుగు రోజులుగా జ్వరాలు వస్తున్న ఓ మహిళ, ఓ పిల్లవానికి డెంగీ జ్వరం రాపిడ్ టెస్ట్ చేయించగా డెంగీ జ్వరం సోకినట్లు తెలిపారు. అయితే డెంగ్యూ జ్వరంపై దిశా, నిర్ధారణ చేయడానికి నంద్యాల ఆసుపత్రికి ఇద్దరిని పంపించడం జరిగిందన్నారు. గ్రామంలో జ్వరాలు వచ్చిన వారివురు ఉండే ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్, వేస్ట్ ఆయిల్ స్ప్రే చేయించామన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని గ్రామాలలో ఎవరికైనా జ్వరాలు వస్తే వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకొని మందులు వాడలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్, సూర్‌వైజర్ ప్రభావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

సంజామల, మార్చి 23: టీటీడీ ఆధ్వర్యంలో మండలంలోని గిద్దలూరు శివాలయంలో ప్రారంభమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఆలయంలో స్వామివారికి మహిళలు అభిషేకాలతో పాటు కుంకుమార్చన, గోపూజ. కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. టీడీడీ హిందూ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి మల్లు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రామాయణ, మహాభారతం ధార్మిక ప్రవచనలు నిత్యం భజన మండలి ఆధ్వర్యంలో ఆలయంలో భజనలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషమ్మ, ఉపసర్పంచ్ సులోచనమ్మ, అర్చకులు జంగం మహేశ్వరయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

సంజామల గ్రంథాలయం తనిఖీ

సంజామల, మార్చి 23 : గ్రంథాలయం తనిఖీః సంజామల లోని గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రతాప్ తనిఖీ చేశారు. ఉదయం గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయాధికారి బాల తిమ్మారెడ్డితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పాఠకులను పెంచాలని ఆయన కోరారు. రానున్న వేసవిలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందించాలని కోరారు.

మద్యం విక్రేత అరెస్టు

సంజామల, మార్చి 23: అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌రెడ్డి శనివారం తెలిపారు. ముక్కమళ్ల గ్రామం దండె చిన్నశ్రీనివాసులు అనే వ్యక్తి ఆల్వకొండ క్రాస్ రోడ్డులో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడి నిర్వహించి అతని వద్ద 30 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల, మార్చి 23, ఆంధ్రజ్యోతి: ఈవీఎంల పనితీరుపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆళ్లగడ్డ పట్టణంలో శనివారం సెక్టోరల్, తహసీల్దార్లకు, ఎంపీడీవోలకు, ఎఫ్ఎస్‌టీ, ఎంసీసీ, వివిఎస్‌టి, ఎస్ఎస్‌టీ టీంలకు ఈవీఎంలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల రోజున ఈవీఎంల ఏర్పాటు, నిర్వహణలో సమస్యలు తలెత్తకుండా పోలింగ్ అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. వీటిపై సెక్టోరల్, పోలింగ్ అధికారులకు సంపూర్ణ అవగాహన లేకపోతే సమస్యలు తలెత్తే ఆస్కారం ఉందని ఆర్డీవో మల్లికార్జున రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో నజీర్ అహమ్మద్ ఉన్నారు.

ఆళ్లగడ్డ వాసికి డాక్టరేట్


షేక్ అల్లావుద్దీన్

నంద్యాల, మార్చి 23, ఆంధ్రజ్యోతి: ఆళ్లగడ్డ పట్టణానికి పేదింటి విద్యార్థి షేక్ అల్లావుద్దీన్‌కు అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ వారు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఇతనికి మోడలింగ్ సీజనల్, ఇంటర్ అన్యువల్ వేరియబులిటీ ఆఫ్ అట్మాస్పియరిక్ కార్బన్‌డైయాక్సైడ్ మరియు మీథేన్ ఓవర్ ఇండియన్ మాన్సూన్ రీజియన్(ఫిజిక్స్) అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రధానం చేశారు. పరిశోదనలో బాగంగా అంతర్జాతీయ, జాతీయ సమావేశంలో 11 సార్లు పాల్గొని 9 పరిశోధన పత్రాలు ప్రచురించారు. షేక్ అల్లావుద్దిన్‌కు డాక్టరేట్ రావటంతో పట్టణంలోని స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

వీరాంజనేయ స్వామికి విశేష పూజలు

చాగలమర్రి, మార్చి 23: చాగలమర్రిలోని గాంధీ బజార్‌లోగల వీరాంజనేయ స్వామికి వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా సభ్యులు శనివారం విశేష పూజలు చేశారు. తమలపాకులతో అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సామూహికంగా ఆంజనేయస్వామి వ్రతం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ వర్క్‌షాపులో డోన్ నాయకులు


అమరావతిలో జరిగిన టీడీపీ వర్క్‌షాప్‌కు హాజరైన డోన్ నాయకులు

డోన్, మార్చి 23: అమరావతిలోని ఏ-1 కన్వెన్షన్ హాలులో శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల వర్క్‌షాపు కార్యక్రమానికి డోన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు తరలివెళ్లారు. డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కేఈటీకే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. ఎన్నికల యుద్ధం ముగిసే వరకు సైనికుల్లా పని చేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేసినట్లు వారు తెలిపారు. టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, వైసీపీ వైఫల్యాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా పని చేయాలని సూచించినట్లు వారు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కొలిమిగుండ్ల, మార్చి 23 : కొలిమిగుండ్ల మండలం పెట్నికోట పరిధిలోని కాచోటి విశ్వేశ్వర స్వామి ఆలయ విగ్రహ, ధ్వజస్తంభ, ప్రతిష్ట పూజలు శనివారం ప్రారంభమయ్యాయి. శివాలయం జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా కలశ స్థాపన, ఆంకురార్పణ, మొదలగు ప్రారంభ పూజలు రుత్వికులు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఆలయ, విగ్రహ, ధ్వజస్తంభ కార్యక్రమాలు ఉంటాయని భక్తులంతా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయం స్ఫూర్తిదాయకం


భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, డీవైఎఫ్ఐ నాయకులు

బేతంచెర్ల, మార్చి 23: సర్దార్ భగత్ సింగ్ ఆశయ సాధనలు స్ఫూర్తిదాయకమని డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మధుశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా స్థానిక డీవైఎఫ్ఐ నాయకులు మధుశేఖర్, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పాలిటెక్నిక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి. హరి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

● పట్టణంలోని వైష్ణవి కాలేజీలో భగత్‌సింగ్ వర్ధంతిని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు హాజరైయ్యారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.5.65 లక్షలు

బేతంచెర్ల, మార్చి 23: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.5.65 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.5,65,221లు దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయాలి


వెంకటనాయునిపల్లె రైల్వే బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

డోన్(రూరల్), మార్చి 23: డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామ రైల్వే అండర్ బ్రిడ్జి జరుగుతున్న ప్రదేశంలో రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కోయలకొంట నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం బ్రిడ్జి పనులను పరిశీలించారు. వెంకటనాయునిపల్లె గ్రామం మీదుగా 15 గ్రామాల ప్రజలు, రైతులు వాహనదారులను దృష్టిలో ఉంచుకుని రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు అధికారులు చేపట్టాలని కోరారు. అండర్ బ్రిడ్జి పనుల వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తిందని, సమస్యను పరిష్కరించాలన్నారు.